క్లుప్తంగా

అన్ని సామాజికవర్గాలకు న్యాయం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్నదృశ్యం

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేస్తున్నారని రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కల్పన అన్నారు. మండల పరిధిలోని గూటుపల్లెకు చెందిన నాగేశ్వర గౌడుకు నూతనంగా కల్లు దుకాణం మంజూరైంది. ఈ మేరకు మంగళవారం కల్లు దుకాణాన్ని సర్పంచ్ శ్రీరాములుతో కలిసి ఆమె ప్రారంభించారు. సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి సీఎం తోడ్పాటు అందిస్తూ డైరెక్టర్ పదవులు ఇచ్చి సముచిత స్థానం కల్పించారన్నారు. కార్యక్రమంలో నంద్యాల ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాసులు, ఈడిగ సంఘం నాయకులు సింహాద్రి గౌడు, నరేంద్ర గౌడు పాల్గొన్నారు.

ఇంజినీర్ అసిస్టెంట్ బదిలీ



సుప్రజను సన్మానిస్తున్న దృశ్యం

సంజామల: మండల పరిధిలోని ముక్కమల్ల గ్రామ సచివాలయంలో ఇంజినీర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిసున్న సుప్రజ కోవెలకుంట్ల మూడవ సచివాలయానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం సుప్రజను ఎంపీపీ పోచ రమాదేవి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముక్కమల్ల సర్పంచ్ కనక రమాదేవి, మాజీ సర్పంచ్ పోచా వెంకట రామిరెడ్డి, వైఎస్సాఆర్ సీపీ నాయకులు పోచా శివారెడ్డి, శనివారపు వెంకట సుబ్బారెడ్డి, తిరపతి రెడ్డి పాల్గొన్నారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల సచివాలయం పరిధిలోని పేరుసోముల, రామిరెడ్డి పల్లె గ్రామాలలో బుధవారం ఉదయం 8 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, సంజామల వైస్ ఎంపీపీ చిన్న బాబు తెలుపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరవుతున్నారు.ఎమ్మెల్యే గడప గడపను సందర్శించి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తారన్నారు. అదేవిధంగా ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకొని పరిష్కార చర్యలు చేపడతారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు,కార్యకర్తలుగృహసారథులు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



నగదు అందజేస్తున్న సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ గ్రామానికి చెందిన అంజి అనారోగ్యంతో మరణించారు. మృతుని భార్య పిల్లి నాగదేవికకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలను మంగళవారం సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి మహబూబ్ బాషా అందజేశారు. కార్యక్రమంలో సంక్షేమ సహాయకులు నాగార్జున, నాయకుడు నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలి

డోన్ టౌన్ : వ్యవసాయ రంగంలో స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫారసులను అమలు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లంకా సుబ్బరాయుడు, మండల అధ్యక్షుడు నాగమద్దయ్య కోరారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం కర్షక,-కార్మిక రాష్ట్ర సదస్సు వాల్ పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర ట్రేడ్ యూనియన్ల ఐక్య వేదిక, కిషాన్ మోర్చా కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా ఈ నెల 30న విజయవాడ సిద్ధార్థ కళాశాల నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సదస్సుకు కార్మికులు, కర్షకులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మణిపూర్ దోషులను శిక్షించాలి

బనగానపల్లెరూరల్: మణిపూర్ సంఘటనలో మహిళలను నగ్నంగా ఊరేగించిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీపీఐ మండల కార్యదర్శి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బనగానపల్లె పట్టణంలోని పెట్రోల్‌బంకు సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బాలకృష్ణ, దానంరంగన్న, రామలచ్చమ్మ, పద్మావతి,లక్ష్మీదేవి,నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

● ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వేదికపై డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ మనజిర్‌జిలానీ సామూన్, డీఆర్ఓ పుల్లయ్య

బనగానపల్లె: ప్రజా సమస్యల పరిష్కారమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. ప్రజలను నేరుగా కలుసుకుని సమస్యలు పరిష్కరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం, సాంకేతిక సమస్యల మూలంగా ప్రభుత్వ పథకాలు అందని అర్హులను గుర్తించేందుకు, ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే కాటసాని అధ్యక్షతన మంగళవారం స్థానిక ధనలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అంజాద్‌బాషా, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ మనజిర్‌జిలానీ సామూన్, డీఆర్ఓ పుల్లయ్య హాజరయ్యారు. డిప్యూటీ సీఎం సీఎం అంజాద్‌బాషా, జిల్లా స్థాయి అధికారుల సమక్షంలో ఎమ్మెల్యే కాటసాని నియోజకవర్గంలో జరిగిన, చేయాల్సిన అభివృద్ధిని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ ఇంత వరకు నియోజకవర్గంలో సుమారు 6వేలు ఇళ్లపట్టాలు ఇళ్లు మంజూరు అయ్యాయన్నారు. ఇంకా అర్హులై ఉండి ఇళ్లలేనివారికి మరో 6వేల ఇళ్లు మంజూరు చేయాల్సి ఉందన్నారు. బనగానపల్లె పట్టణంలో ఎస్ఆర్‌బీసీకి ఇరువైపులా ఉన్న స్థలాలు అక్రమణకు గురవుతున్నాయని, అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టాలన్నారు. పట్టణంలో 3వేల ఇళ్ల పట్టాలు పంపిణీ జరిగే సమయంలో టీడీపీ నాయకులు కోర్టుకు వెళ్లడంతో నిలిచిపోయిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలో కోర్టు సమస్యకు పరిష్కారం లభిస్తుందని, ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని చెప్పారు. అవుకు మండలం వేములపాడు చెరువు గేట్లు అభివృద్ధి పరచి 400 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కోవెలకుంట్ల మండలంలోని కుందూనది వెంట లింగాల నుంచి గుళ్లదూర్తి వరకు ఉన్న సిల్ట్‌ను రైతులు వ్యవసాయ భూములకు వినియోగించుకునేలా అధికారులు అనుమతులు ఇవ్వాలన్నారు. ఎస్సార్‌బీసీ కాల్వలు, రహదారుల అభివృద్ధికి అధికారులు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. గ్రామాల్లో విద్యుత్‌లైన్ షిఫ్టింగ్‌లో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని, జలకళ పథకం కింద బోర్లు వేసిన రైతులకు విద్యుత్ సప్లయ్ వెంటనే చేయాలన్నారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గంలో ఇళ్లపట్టాలు, ఇళ్లు లేనివారు చాలామంది ఉన్నారని, మంజూరు చేయాలని కోరారు. కొలిమిగుండ్ల మండలంలో 25 టీఎంసీల నిల్వకు మల్టీపర్పస్ రిజర్వాయర్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డోన్, నంద్యాల ఆర్డీఓలు వెంకటరెడ్డి, శ్రీనివాసులు, జిల్లా స్థాయి అధికారులు విజయభాస్కర్‌నాయుడు, మంజులవాణి, మనోహర్, శ్రీధర్‌రెడ్డి, మోహన్‌రావు, రామచంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, డాక్టర్ వెంకటరమణ, జెడ్పీటీసీలు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు



మాట్లాడుతున్న రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు

డోన్ : పేద, మధ్య తరగతి ప్రజల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేసి సత్ఫలితాలు సాధిస్తున్నారని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు తెలిపారు. మండలంలోని చిన్నమల్కాపురం గ్రామం 1, 2 గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశలో ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా భావించి పథకాలు అమలు చేస్తున్న చరిత్ర దేశంలో ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రైతాంగం సంక్షేమంతో పాటు పేదల సొంతింటి కల, మహిళ ఆర్థికాభివృద్ధికి సీఎం ప్రత్యేక చర్యలు చేపట్టారని గుర్తు చేశారు. ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మోడల్ నియోజకవర్గంగా డోన్‌ను తీర్చిదిద్దేందుకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అంకితభావంతో కృషి చేస్తున్నారన్నారు. డోన్ నియోజకవర్గంలో రూ 2,400 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యమని గుర్తు చేశారు. త్వరలోనే గోరుకల్లు రిజర్వాయర్ నుంచి ఇంటింటికీ మంచినీరు అందించడం జరుగుతుందన్నారు. రూ.185 కోట్లతో 4 రెసిడెన్షియల్ కళాశాలలు, రూ.40కోట్లతో చేపట్టిన వంద పడకల ప్రభుత్వాసుపత్రి ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బద్దల రాజకుమార్, ఎంపీటీసీలు తవిసికొండ రామలక్ష్మి, సువర్ణ, సర్పంచ్ లక్ష్మిప్రసన్న, ఉపసర్పంచ్ బుగ్గన రాజేశ్వర రెడ్డి, గ్రామ పెద్దలు దొంతిరెడ్డి కృష్ణారెడ్డి, మహానందిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతురెడ్డి, డీలర్ బాషా, రాచెర్ల ఉసేన్‌పీరా, ముక్కు మద్దయ్య, శివనాగమద్దయ్య, నడిపి లక్ష్మన్న, తలారి రామానాయుడు, దొరపల్లె మధు, భాస్కర్‌రెడ్డి, ఉడుములపాడు తోపిరెడ్డి క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న చలం రెడ్డి

బేతంచెర్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిరుద్యోగులకు అండగా నిలుస్తుందని, జాబ్ మేళాను నిర్వహిస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలోని పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మినీ జాబ్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా చలం రెడ్డి మాట్లాడుతూ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సారథ్యంలో నిరుద్యోగ యువతకు ప్రైవేట్ సంస్థలలోనూ ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. జాబ్ మేళాకు 130 మంది యువతి, యువకులు పాల్గొనగా వైఎస్‌కే ఇన్ఫోటెక్-10, బజాజ్ లిమిటెడ్ కంపెనీ-11, డిక్షన్ టెక్నాలజీస్‌కు -20 మంది చొప్పున మొత్తం 41 మంది ఉద్యోగాలు సాధించారన్నారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాప్‌రెడ్డి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ రాజేష్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

జీవాల పెంపకం లాభదాయకం



శిక్షణ ఇస్తున్న అధికారులు

కోవెలకుంట్ల: గొర్రెలు, మేకల పెంపకం అన్ని విధాలా లాభదాయకమని గొర్రెల పెంపక శిక్షణ కేంద్ర సహాయ సంచాలకులు శ్రీనివాసరెడ్డి, రామసుబ్బారెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథ కార్యాలయ సమావేశ భవనంలో రాష్ట్ర గొర్రెల పెంపక శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో కోవెలకుంట్ల, గోస్పాడు మండలాల గొర్రెల పెంపకందారులకు ఒక రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. గొర్రెల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులు, జీవాలకు సోకే అంటువ్యాధులు, నివారణ పద్ధతులు, టీకాల ప్రాముఖ్యత, నట్టల నివారణ, విత్తన పొట్టేళ్ల మార్పిడి, ప్రస్తుత వర్షాకాలంలో జీవాలకు సోకే వ్యాధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులు వ్యవసాయంతోపాటు జీవాల పెంపకం చేపట్టి ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్ర పశువైద్యాధికారులు ప్రశాంతి, జానకి, శ్రీనివాసులు, మేజర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, కోవెలకుంట్ల, గోస్పాడు పశువైద్యులు కృష్ణకుమార్, ఉమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటిక సమస్యలు పరిష్కరించండి



కలెక్టర్ మనజీర్ జిలానీ శ్యామూన్, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న తండా వాసులు

అవుకు: శ్మశానవాటిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శ్యామూన్, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి మండల పరిధిలో కొండమీది గ్రామాలైన మన్నేనాయక్ తండా, ఇస్రానాయక్ తండా ప్రజలు వినతి పత్రం అందజేశారు. బనగానపల్లెలో జరుగుతున్న నియోజకవర్గస్థాయి సమీక్ష సమావేశానికి హాజరైన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే కాటసానిని తండాలవాసులు కలిసి సమస్యలను విన్నవించారు. రెండు గ్రామాల్లో దాదాపు రెండువేల జనాభా ఉంటుందని, అంతటా రాళ్లు ఉన్నందున ఎవరైనా మృతి చెందితే పూడ్చడానికి ఇబ్బందులు పడుతున్నామన్నారు. శ్మశాన వాటికలు ఏర్పాటు చేసి ఆరు అడుగుల ఎత్తు వరకు మట్టిని తోలించాలని వారు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవిభాయి, గ్రామస్తులు లక్మానాయక్, రాముడు నాయక్, జయరాముడు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆధునిక టెక్నాలజీ అందించాలి

డోన్ టౌన్ : విద్యార్థులకు ఆదునిక టెక్నాలజీ అందించినప్పుడే అభివృద్ధి చెందుతారని మండల విద్యాధికారి-2 రాజేశ్వరి, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి అన్నారు. పాతపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో మంగళవారం గణితం, జీవ శాస్త్రం ఉపాధ్యాయులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బైజూస్ యాప్ ద్వారా ఆధునిక టెక్నాలజీ నేర్పాలని, ఐఎఫ్‌పీ ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచేలా చేయాలన్నారు. శిక్షణలో జీవశాస్త్రానికి వెంకటేశ్వరగౌడ్, గణితానికి లక్ష్మీకాంతరెడ్డి, ప్రైమరీ తరగతులకు ఎల్లరాజు ఆర్పీలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో సీఆర్పీలు రామాంజనేయులు, ఘన మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి



చెన్నంపల్లెలో ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న అధికారులు



బెలుంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి



సంజామలలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎంపీపీ పోచా రమాదేవి



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ బుగ్గన, అధికారులు



బనగానపల్లిరూరల్‌లో లబ్ధిదారుడికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఎంఈఓ స్వరూప

కోవెలకుంట్ల: ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందిస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఐదవ గ్రామ సచివాలయ ఆవరణలో సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చిక్కేపల్లి ప్రసాద రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అనంతరం కుల, ఆదాయ, పుట్టినతేదీ, వన్‌బీ అడంగళ్లు తదితర ధ్రువీకరణ పత్రాలను డీటీ చంద్రశేఖర్, ఈఓ గోపీనాథ్‌తో కలిసి ఆయన లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి కృష్ణకుమార్, సూపరింటెండెంట్ నరేంద్రనాథ ఆచారి, ఏఈఓ వెంకటేశ్వరరెడ్డి, ఎంఎల్ఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: అర్హత ఉన్నా వివిధ సర్టిఫికెట్లు లేని కారణంగా సంక్షేమ పథకాలు పొందని వారి సమస్యలను పరిష్కరించడమే జగనన్న సురక్ష లక్ష్యమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ మొలక రాజారెడ్డి అన్నారు. మంగళవారం బెలుం, బిఉప్పలూరు గ్రామ సచివాలయాల పరిధిలో అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. బెలుంలో 1205, బిఉప్పలూరులో 1801 సర్టిఫికెట్లను లబ్ధిదారులకు వారు ఉచితంగా అందజేశారు. జగనన్న సురక్షతో పేదలకు మేలు జరుగుతుందని ఈసందర్భంగా వారు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మారం నీలమ్మ, ప్రభావతి, ఈశ్వరయ్య, ఎంపీటీసీ సభ్యులు సలోమి, క్రిష్టారెడ్డి, డీటీ మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాల పంపిణీ

అవుకు:మండల పరిధిలోని గుండ్లశింగవరం, చెన్నంపల్లె, శివవరం గ్రామాల్లో మంగళవారం అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు 572 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లచ్చమ్మ, ఉపసర్పంచ్ గడ్డం ఆదినారాయణ రెడ్డి, పీఏఎల్ఆర్ డీటీ శ్రీనివాసులు, ఈఓ అశ్విన్ కుమార్, ఆర్ఐ రాముడు, పంచాయతీ కార్యదర్శు లు శ్రీనివాసులు,నాగలక్ష్మమ్మతదితరులు పాల్గొన్నారు.

సంజామల: సాంకేతిక సమస్యల మూలంగా సంక్షేమ పథకాలు అందని పేదలను గుర్తించి న్యాయం చేయడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని ఎంపీపీ పోచా రమాదేవి తెలిపారు. మండల పరిధిలోని ముక్కమల్ల సచివాలయ ఆవరణలో మంగళవారం అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ అనిల్ కుమార్, సర్పంచ్ కనక రమాదేవి, మాజీ సర్పంచ్ పోచ వెంకట రామిరెడ్డి తదితరులతో కలిసి ఎంపీపీ లబ్ధిదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పోచా శివారెడ్డి,శనివారపు వెంకట సుబ్బారెడ్డి, తిరపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు అందని అర్హులకు న్యాయం చేయడానికి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ, సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామంలో సర్పంచ్ వెంకటలక్షమ్మ, ఎంపీటీసీ రత్నమ్మ, తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, గోర్లగుట్టలో సర్పంచ్ బూషి మాదక్క, ఎంపీడీఓ వెంగన్న ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. లబ్ధిదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలను అధికారులతో కలిసి వారు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పాలనలో సమూల మార్పులు తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శం అన్నారు. కార్యక్రమంలో డీటీ సత్యదీప్, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్‌రెడ్డి, గూని నాగరాజు, రవి, తిరుమలేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకిరెడ్డి, ఎద్దులన్న, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బనగానపల్లెరూరల్: మండలంలోని వెంకటాపురం, తమ్మడపల్లె గ్రామ సచివాలయంలో మంగళవారం అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకటాపురంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఎంఈఓ స్వరూప సర్పంచ్ టీ.హరిత, వైఎస్సార్‌సీపీ నాయకుడు టి.శ్రీనివాసరెడ్డి కలిసి 765 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అదేవిధంగా తమ్మడపల్లెలో వీఆర్ఓ అబ్దుల్లా, పంచాయతీ కార్యదర్శి లక్ష్మినారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు మధుతో కలిసి సర్పంచ్ వెంకట్రామిరెడ్డి 744 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

నేడు చిన్న సరిగెత్తు

కొలిమిగుండ్ల: మొహర్రం వేడుకల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం చిన్న సరిగెత్తు వేడుకలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. చావిళ్లను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. పీర్లను అందంగా అలంకరించి మత పెద్దల ఆధ్వర్యంలో మేళతాళాల మధ్య ఊరేగింపు నిర్వహించనున్నారు. గురువారం విడిదినం, శుక్రవారం పెద్ద సరిగెత్తు, శనివారం పీర్ల నిమజ్జనం చేయనున్నారు.

బనగానపల్లె రూరల్: మొహర్రం ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి చిన్న సరిగెత్తు ఉత్సవం ఘనంగా నిర్వహించేందుకు నిర్మాహకులు ఏర్పాటు పూర్తి చేశారు. బనగానపల్లె పట్టణంలోని ఆస్థానంలో కొలువైన హాజరత్ అబ్బాస్ పీర్ల, పోలీసు సర్కిల్ కార్యాలయం ప్రక్కలో కొలువైన ఇమాంఖాసీం, నవాబు కోటలో కొలువైన పీర్లతో పాటు పలు పీర్ల చావిడిలను ముస్తాబు చేశారు.

కాలనీలను ఆదర్శంగా తీర్చిదిద్దడానికి చర్యలు

బేతంచెర్ల: పట్టణంలోని ఆయా కాలనీలను ఆదర్శంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నట్లు నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని సంజీవనగర్ కాలనీ ప్రజల విన్నపం మేరకు నూతనంగా వేస్తున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వ నిర్మాణ పనులను కమిషనర్ రమేష్ బాబు, నగర పంచాయతీ చైర్మన్ తనిఖీ చేశారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామనాయుడు, నిరంజన్, మల్లి, సాయి కిరణ్, నాగరాజు, మధు, ఖాజా పాల్గొన్నారు.

హజరత్ అబ్బాస్... వెయ్యి దివిటీల వెలుగు

● మొహర్రంలో హజరత్ అబ్బాస్‌కు ప్రత్యేకత
● షియా మతస్తుల ఆధ్వర్యంలో వేడుక
● రేపు మధ్య సరిగెత్తు... పీరు ఊరేగింపునకు ఏర్పాట్లు



కోవెలకుంట్లలోని బసిరెడ్డిబావి వీధిలో కొలువు దీరిన హజరత్ అబ్బాస్ పీరు



వెయ్యి దివిటీల వెలుగులో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం(ఫైల్)

కోవెలకుంట్ల: హిందూ, ముస్లింలు మతసామరస్యానికి ప్రతీకగా నిర్వహించే మొహర్రం వేడుకల్లో స్థానిక బసిరెడ్డిబావి వీధిలో కొలువుదీరిన హజరత్ అబ్బాస్ పీరుకు ప్రత్యేకత ఉంది. ప్రతి ఏటా మధ్య సరిగెత్తు రోజునవెయ్యి దివిటీల వెలుగులో స్వామివారి ఊరేగింపు ఆనవాయితీ. ఈ నెల 20న మొహ్రరం వేడుకలు ప్రారంభం కాగా గురువారం మధ్య సరిగెత్తు వేడుకలు జరుగనున్నాయి. పీర్ల చావిడిలో హజరత్ అబ్బాస్ పీరుతోపాటు ఇమాం కాశీం పీరును కొలువుంచి భక్తులు ఫతేహాలు సమర్పిస్తున్నారు.

హజరత్ అబ్బాస్ చరిత్ర

ఖర్బలా మైదానంలో యజీద్‌రాజుతో జరిగిన యుద్ధంలో మహమ్మద్ ప్రవక్త మనువడు ఇమాం ఉసేన్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యుడైన హజరత్ అబ్బాస్ మృతి చెందినట్లు పూర్వీకుల కథనం. హజరత్ అబ్బాస్‌ను స్మరించుకుంటూ ఆయన పేరుతో కోవెలకుంట్ల పట్టణంలోని బసిరెడ్డి బావి వీధిలో పీరును ఏర్పాటు చేసి కొన్ని దశాబ్దాల నుంచి కాశీంవలి వంశస్తులు అహమ్మద్ ఉసేన్, ఉసేన్‌సాహెబ్, సజ్జాద్ ఉసేన్, అబ్బాస్, బాషా ఆధ్వర్యంలో మొహర్రం వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మొహర్రం వేడుకల్లో భాగంగా చావిడిలో మంగళవారం పీరును కొలువుంచారు. గురువారం అర్ధరాత్రి షియా మతస్తుల ఆధ్వర్యంలో వెయ్యి దివిటీల వెలుగులో హజరత్ అబ్బాస్ పీరును పట్టణంలోని పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించనున్నారు. బనగానపల్లె, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో ఉన్న షియా మతస్తులు మాతం నిర్వహిస్తూ ఊరేగింపు సాగుతుంది. అనంతరం ప్రత్యేక ఫతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు.

వాటర్ గ్రిడ్ పనులు పరిశీలన



అభివృద్ధి పనులపై అధికారులతో చర్చిస్తున్న బేతంచెర్ల, డోన్ ప్రజా ప్రతినిధులు

బేతంచెర్ల: ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతో డోన్ నియోజకవర్గ ప్రజలకు శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రూ. 340 కోట్లతో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి చేపట్టిన వాటర్ గ్రిడ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ మేరకు మంగళవారం మండల పరిధిలోని బుగ్గానిపల్లె తాండ సమీపాన జరుగుతున్న వాటర్ గ్రిడ్, పైపు లైను నిర్మాణ పనులను బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, డోన్ ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి, మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, మంత్రి ఓఎస్డీ ప్రతాప్ రెడ్డి పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, మంత్రి పీఏ శ్రీనివాసులు రెడ్డి, వైఎస్సార్ నాయకులు బుగ్గన మన్‌మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. స్థానిక బుగ్గన బీపీ శేషారెడ్డి కుట్టు శిక్షణా కేంద్రంలో మూడు నెలల శిక్షణ పూర్తి చేసిన రెండు బ్యాచ్‌ల మహిళలకు మంగళవారం ఆయన సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జాకీర్, కౌన్సిలర్లు పాలుట్ల రఘురాం మీనాక్షి, ఆర్ట్ రమణ, శిక్షకులు వెంకటేశ్వర్లు, విజ్ఞేష్, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

సరిగెత్తు వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

అవుకు: మొహర్రం వేడుకల్లో భాగంగా సరిగెత్తు వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ నరేంద్రకుమార్ ప్రజలకు సూచించారు. అవుకు పట్టణంలో సరిగెత్తు వేడుకలు బుధవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎస్ఐ ప్రజలకు సూచనల చేశారు. వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, అల్లర్లు, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పీర్ల చావిళ్ల వద్ద ఎలాంటి సంఘటనలు జరుగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.